చివరికి సాగు నీరందక..

- ఎండుతున్న పంటలు
- కాలువ నీరు రాదు.. కరెంటు ఉండదు..
- మండల శివార్లలో పరిస్థితి అధ్వానం
- ఇబ్బంది పడుతున్న రైతులు

కడియం: గోదావరి నదికి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కడియం మండలం శివారు ప్రాంతాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోటిపల్లి కాలువ నుంచి ఆలమూరు మండలం మడికి మీదుగా కడియం మండలం దుళ్ల గ్రామానికి సాగునీటిని సరఫరా చేసే కాలువకు తగినంత పూటుతో నీరు రావడం లేదు. దీంతో పంటలకు నీరందక రైతులు అవస్థలు పడుతున్నారు. కాలువ నీరు రాకపోయినప్పటికీ విద్యుత్‌మోటార్ల ఆధారంతోనైనా పంటను కాపాడుకుందామనుకుంటే విద్యుత్ కోతలు రైతులను వేధిస్తున్నాయి. దుళ్ల గ్రామానికి తూర్పువైపున ఉన్న పొలాలకు దాదాపు పదిహేను రోజులుగా నీరందడం లేదని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం చేలు నెర్రలు వీడి ఉన్నాయని వివరిస్తున్నారు. చిరుపొట్ట దశలో ఉన్న పొలాలకు తగినంత నీటిని అందించకపోతే దిగుబడిపై ప్రభావం పడుతుందని, తద్వారా నష్టాన్ని ఎదుర్కొవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

అన్నీ సమస్యలే..

మండలంలోని మురమండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని దుళ్ల గ్రామానికి విద్యుత్ సరఫరాలో పలు సమస్యలు ఎదురవుతున్నాయి. ఎక్కడికక్కడే విద్యుత్ లైన్లు కిందకు వేళాడుతూ ఉంటున్నాయి.



దుళ్ల తూర్పుపొలాల్లో నెర్రలు తీసిన వరిచేలు

దీంతో వర్షం వచ్చినా, చిన్నపాటి గాలులు వచ్చినా సరఫరా నిలిచిపోతోందని రైతులు చెబుతున్నారు. దీనికి తోడు ట్రాన్స్‌ఫార్మర్లు కూడా మొరాయిస్తున్నాయంటున్నారు. తరచూ సరఫరా లోపాలు, ట్రాన్స్‌ఫార్మర్ల మొరాయింపుల కారణంగా సమయానికి నీరందక వరిచేలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడైనా పాడయితే త్వరగా బాగుజేయకుండా తగినంత మంది సిబ్బంది అందుబాటులో లేరన్న సాకు చూపి రోజుల తరబడి మరమ్మతు పనులు చేస్తూ రైతుల సమస్యను మరింతగా పెంచుతున్నారని, ఈ సమస్యను విద్యుత్‌శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదని రైతులు చెబుతున్నారు.

15 రోజులుగా నీరందక..

గ్రామానికి తూర్పువైపు ఉన్న దాదాపు 200 ఎకరాలకుపైగా వరిసాగు చేసే భూములకు పదిహేను రోజులుగా నీరందడంలేదు. విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండడం లేదని, రోజుల తరబడి మరమ్మతులతో సిబ్బంది కాలక్షేపం చేస్తున్నారంటూ రైతులు చెబుతున్నారు. దుళ్ల శివారు చింతాలమ్మ గుడి సమీపంలోని బిస్కెట్ల ఫ్యాక్టరీ పుంతలోను, నర్సిపూడి పుంతలోనూ ప్రస్తుతం విద్యుత్ సరఫరా లేదు. దీంతో సిబ్బందికి పదేపదే ఫోన్లు చేసినా స్పందించడంలేదు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం వేసవి ఎండలను తలపిస్తున్న నేపథ్యంలో వరి పంటకు సాగునీరు అత్యవసరం లేకపోతే దిగుబడిలో తీవ్రనష్టం వస్తుందని రైతులు ఆందోళన చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై దృష్టి పెట్టి తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కాలువ నీరు అందక..

మడికి కాలువ పూడికతీత పనులు జరక్కపోవడంతో దుళ్ల గ్రామంలోని పొలాలకు కాలువ నీరు అందే పరిస్థితి లేదు. పోనీ విద్యుత్‌మోటార్లపై నీరు పెడదామన్నా సరఫరా సక్రమంగా ఉండక తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ఏం చేయలో పాలుపోవడంలేదు.

– ఎం.మణికుమార్, కౌలు రైతు దుళ్ల

ఇలా అయితే సాగు కష్టమే..

ట్రాన్స్‌ఫార్మర్ పాడై సుమారు పది రోజుల నుంచి పొలాలకు నీరులేకుండా పోయింది. బాగు చేశాక, ఎడ్జ్‌ఫీజ్ నిలబడడం లేదని విద్యుత్‌శాఖ సిబ్బంది చెబుతున్నారు. ఎన్నిసార్లు ఫీజు వేసినా సరఫరా సక్రమంగా లేదు. శాశ్వత పరిష్కారం ఏంటి అని అడిగితే సిబ్బంది తగిన సమాధానం ఉండడం లేదు. ఇలా అయితే సాగు చేయడం కష్టమే. ఉన్నతాధికారుల తమ సమస్యను పట్టించుకోవాలి.

– సీహెచ్‌వీ రావు, రైతు, దుళ్ల

క్లుప్తంగా

రూరల్ ఈవో పీఆర్‌అండ్ ఆర్డీ బాబూరావు బదిలీ

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ మండల ఈవో పీఆర్‌అండ్‌ఆర్డీ డి.బాబూరావు కృష్ణాజిల్లా గంపలగూడెంనకు బదిలీ అయ్యారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఆరమ్‌స్ట్రాంగ్‌ను రూరల్ మండలానికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పరిపాలనాధికారిగా ఆకెళ్ల

రాజమహేంద్రవరం రూరల్ మండల పరిషత్ కార్యాలయం పరిపాలనాధికారిగా ఆకెళ్ల వరప్రసాద్ నియమితులయ్యారు. ఆయన జగ్గంపేట నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న బీవీజేఎస్ రామాచార్యులు రంగంపేటకు బదిలీ అయ్యారు. సోమవారం సాయంత్రం ఆకెళ్ల వరప్రసాద్ పరిపాలనాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎంపీడీవో డి.శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి జాయినింగ్‌ఆర్డర్‌ను అందించారు.

జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌కు విద్యార్థుల ఎంపిక

ప్రకాశం నగర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికల్లో సిటీ హైస్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయులు వైవీ రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ స్థాయి సెలక్షన్‌లో అండర్ 14, 17 విభాగాలలో చదరంగంలో ఇసాక్‌బాబు, శివ సూర్యతేజ, ఖోఖోలో చంద్రమహేష్, దీక్షిత్, చైతన్య, సంతోష్‌కుమార్, శ్యామ్, శ్రీనివాస్, జనార్దన్, వివేక్ ఎంపికయ్యారన్నారు. బాలికల విభాగంలో సిరి అనూహ్య, రాజేశ్వరి, హర్షిత, మహాకాళి ఎంపికయ్యారని చెప్పారు. ఈ నెల 28, 30న కాకినాడలో జరగబోయే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళకు సేవలు



మతిస్థిమితం లేని మహిళ జుట్టు కట్ చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామంలో మతిస్థిమితం లేని మహిళను చూసి మహిళా మండలి అధ్యక్షురాలు షేక్ సమీరాబేగం చలించిపోయింది. మతిస్థిమితం లేని మహిళ జుట్టు ముడిలు కట్టుకుపోయి తలనిండా పుండ్లు పడి రక్తం, చీము కారుతుంది. దీంతో వెంటనే ఆమె చంటి, మరడాపు శేఖర్, నాయుడుల సహకారంతో ఆ మహిళ జుట్టు కత్తిరించి, ఆమె పుండ్లకు ఆయింట్మెంట్ రాసింది. అలాగే టిఫిన్, జ్యూస్ తాగించింది. ఈ మహిళను ఏదైనా హోమ్ చేర్పిస్తే రక్షణ ఉంటుందని షేక్‌సమీరాబేగం అధికారులను కోరారు.

కాతేరులో ఆక్రమణల తొలగింపు



జేసీబీలతో కాతేరులో ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు గ్రామంలోని మెయిన్‌రోడ్డులో ఆక్రమణలను అధికారులు జేసీబీలతో తొలగించారు. కాతేరు మెయిన్‌రోడ్డుకు ఆనుకుని ఆక్రమణలు ఉండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇటీవల కాతేరు పర్యటనలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి పరిశీలించి ప్రజలకు ఇబ్బందిగా ఉన్న ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈమేరకు సోమవారం ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు,సిబ్బందితో కలిసి ఆక్రమణలను జేసీబీలతో తొలగించారు.

సినిమాలు

శ్యామల	35 చిన్నకథకాదు
సూర్యమినీ	ట్రాన్స్‌ఫార్మర్స్–1
సూర్యప్యాలెస్	శివాజీ
స్వామి	సరిపోదా శనివారం
అశోక	గొర్రె పురాణం
శివజ్యోతి	మత్తు వదలరా–2
అనుశ్రీ	మత్తు వదలరా–2
రాజా	మత్తు వదలరా–2
రంభ	హైడ్అండ్‌సీక్, కళింగ
ఊర్వశి	100క్రోర్స్,కమిటీకుర్రోళ్ళు
మేనక	జర్నీ,చిక్లెట్స్
కుమారి	డిమోంటీకాలనీ–2, దిగ్రేటెస్టఆఫ్‌ఆల్‌టైమ్(గోట్)
అప్సర	సరిపోదా శనివారం
నామవరం	
వీఎస్.మహల్	ఏఆర్ఎం
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	మత్తు వదలరా–2
కడియం	
వెంకటసూర్య	మత్తు వదలరా–2

అర్జీలు పరిష్కరించేందుకు కృషి



అర్జీదారుల నుంచి సమస్యను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ నరసింహకిశోర్

- జిల్లా ఎస్పీ నరసింహకిషోర్
- పోలీస్ పీజీఆర్ఎస్‌కు 39 ఫిర్యాదులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): నిర్దేశ సమయంలో అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ×ప్రజా సమస్యల పరిష్కార వేదిక ×పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం₹ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. పీజీఆర్ఎస్‌కు 39 ఫిర్యాదులు అందాయి. వినతులను పరిశీలించి సరైన సమయంలో పరిష్కరిస్తామన్నారు. పోలీసు 'పీజీఆర్ఎస్' కార్యక్రమానికి 39 ఫిర్యాదులు రాగా, వీటిలో సివిల్ కేసులు, కుటుంబ సమస్యల గురించి, చీటింగ్ కేసులు, కొట్లాట కేసులు, దొంగతనం కేసులు, ఇతర కేసులకు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్(ఎస్‌బి) అనసూరి శ్రీనివాసరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ అలీ ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

లడ్డూ వ్యవహారంలో సీబీఐ విచారణ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీకే విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: తిరుమల లడ్డూ వ్యవహారంలో కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా ఉందని, ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ నిర్వహించి చర్యలు చేపట్టాలని డీసీసీ అధ్యక్షుడు డా.టీకే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలో ప్రెస్‌క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లడ్డూ తయారీలో నెయ్యి విషయంలో తక్షణమే విచారణ నిర్వహించేలా చర్యలు చేపట్టి, దోషులను శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్టిన్ లూథర్, బాలేపల్లి మురళిధర్, బెజవాడ రంగారావు, అబ్దుల్లా షరీఫ్, శారద పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి

సీటీఆర్ఐ: టీటీడీ లడ్డూ విషయంలో జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆరోపించారు. తిరుమల లడ్డూలో జరిగిన కల్తీని నిరసిస్తూ స్థానిక ఆజాద్ చౌక్‌లో సోమవారం టీడీపీ ఆధ్వర్యంలో జగన్ ఫ్లెక్స్ దగ్ధం చేశారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ స్థానిక జనసేన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ లడ్డూ కల్తీకి సంబంధించి అప్పటి జగన్ సర్కార్‌పై చర్యలు తీసుకోవాలన్నారు.

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

రాజమహేంద్రవరం రూరల్: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రతి మంగళ, బుధవారాల్లో చేపట్టామని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు పొలంబాట పట్టి పంటల సాగుపై చర్చిస్తారన్నారు. రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక సమాచార పరిజ్ఞానాన్ని చేరువ చేయడం, వ్యవసాయం, అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించడం, క్షేత్ర సమస్యలకు తక్షణ పరిష్కరించడం, తక్కువపెట్టుబడి అధిక ఉత్పత్తి ఎక్కువ నికర ఆదాయం దిశగా ప్రోత్సాహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి మండలంలో వారానికి రెండు రోజుల చొప్పున, రోజుకి రెండు గ్రామాలలో ముందస్తు ప్రణాళిక ద్వారా ఖరీఫ్, రబీ పంట కాలంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామన్నారు.

నగరంలో ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారుల తనిఖీ



కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో హోటల్స్, రెస్టారెంట్లు, ఫుడ్ కోర్ట్స్, మొబైల్ క్యాంటీన్లలో నాణ్యమైన ఆహార పదార్థాలు లభించడం లేదనే వివిధ మాధ్యమాల ద్వారా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈట్ రైట్ కాంపెయిన్ పేరిట తనిఖీలు చేపడుతున్నట్టు కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం తెలిపారు. నగర పాలక సంస్థ శానిటరీ సూపర్ వైజరు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆధ్వర్యంలో 3 కమిటీలు నగరంలో తనిఖీలు నిర్వహిస్తున్నాయన్నారు. ఇప్పటివరకు నగరంలో ముఖ్య ప్రాంతాలైన దేవీచౌక్, కంబాలచెరువు, ఈట్ స్ట్రీట్, జీఎన్‌టీ రోడ్, జేఎన్‌రోడ్, ఆర్టీసీ కాంప్లెక్సు రోడ్లలో విక్రయ కేంద్రాలపై దృష్టి సారించామన్నారు. అలాగే ప్రధానమైన హోటళ్లు, రెస్టారెంట్లను కూడా తనిఖీ చేస్తున్నామన్నారు. ఇప్పటివరకూ అపరిశుభ్ర వాతావరణం ఉన్న 10 హోటళ్లకు నోటీసులు జారీ చేసి, నుంచి రూ.17,500ల అపరాధ రుసుం వసూలు చేశబూమన్నారు.

బొమ్మూరులో 'ఇది మంచి ప్రభుత్వం'

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామంలో ఎంపీడీవో డి.శ్రీనివాసరావు అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. మండల ప్రత్యేకాధికారి కేఎస్.జ్యోతి, మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

దాడులకు దిగుతున్న ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలి

రాజమహేంద్రవరం సిటీ: ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులపై దాడులకు దిగుతున్న కాకినాడ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజులపై చట్టపరమైన చర్యలు చేపపట్టాలని స్వతంత్ర జనతా పార్టీ (రిపబ్లిక్) చీఫ్ బర్రే ఆనంద్ కుమార్ సోమవారం రాజమహేంద్రవరంలో డిమాండ్ చేశారు. గతంలో ఎస్సీలపై కుల వివక్ష కలిగిన ప్రజాప్రతినిధులు వారే ప్రత్యక్ష దాడులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ రాజకీయ ఎదుగుదలకు ఎస్సీలను బలిపశులను చేస్తున్నారని, ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ ఎమ్మెల్యే నానాజీ ఎస్సీ వర్గానికి చెందిన ప్రభుత్వ డాక్టర్ ఉమామహేశ్వరరావుపై రెచ్చిపోయి మీడియా, ప్రజల సమక్షంలోనే దాడి చేశారన్నారు. ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు అంబేడ్కర్ ఫ్లెక్సీ చింపి నిబంధనలను ఉల్లఘించారన్నారు. ఇలాంటి వ్యక్తులను తక్షణమే చట్టసభల నుంచి బహిష్కరించి, కేసులు నమోదు చేసి, తక్షణమే రిమాండ్ చేయాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్ సీపీ నేత కడలి వెంకటేశ్వరరావు మృతి

మాజీ ఎంపీ మార్గాని భరత్, డాక్టర్ గూడూరు శ్రీనివాస్ సంతాపం



కడలి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ : రాజమహేంద్రవరానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, ప్రముఖ బీసీ నాయకుడు కడలి వెంకటేశ్వరరావు(52) హఠాన్మరణం చెందారు. గత రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వైఎస్సార్ సీపీలో చురుకైన నాయకుడిగా, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ కీలక అనుచరుడిగా వ్యవహరించారు. ఆయన మరణాన్ని వైసీపీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. ప్రతి ఏటా శెట్టిబలిజ, గౌడ కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి ఆయన ఎంతో కీలక పాత్ర పోషించేవారు. పేద విద్యార్థులకు చదువుకునేందుకు ఆర్థిక సాయం అందించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రాజకీయాలపై ఉన్న ఆసక్తితో ఉపాధ్యాయ వృత్తిని స్వచ్ఛందంగా వదిలేసి 2014 ఎన్నికల్లో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీలో చేరి మార్గాని భరత్‌రామ్ ముఖ్య అనుచరుడిగా పనిచేశారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితర నాయకులు హుటాహుటిన ఆసుపత్రికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కడలి వెంకటేశ్వరరావు మృతదేహాన్ని స్థానిక రెహమత్ నగర్‌లో ఉన్న ఆయన నివాసానికి తరలించారు. మంగళవారం రాజమండ్రిలో అంత్యక్రియలు నిర్వహిస్తారు.



వెంకటేశ్వరరావు (పాతచిత్రం)

కారుణ్యమూర్తి ఆశయాల సాధనకు కృషి

రాజమహేంద్రవరం సిటీ: సీపీ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, నిరంతర సేవా కారుణ్యమూర్తి చింతా బులి వెంకయమ్మ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లేందుకు మనమంతా కృషి చేయాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. సీపీ రెడ్డి ఆటో మొబైల్స్ అధినేత చింతా నాగ గౌరీ శంకర ప్రసాదరెడ్డి మాతృమూర్తి బులివెంకయ్యమ్మ స్వర్గస్తులు కావడంతో సోమవారం నగరంలో సీపీ రెడ్డి ఆలోమొబైల్స్ షోరూంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చింతా నాగ గౌరీ శంకర ప్రసాదరెడ్డి, చింతా వెంకట ప్రభాకరరెడ్డి, చింతా ఆంజనేయ సంజీవరెడ్డి లను కలసి తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.



చింతా బులి వెంకయమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

ఆయన వెంట రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ అధ్యక్షుడు ఇమ్మణి వెంకట్, స్వర్ణాంధ్ర సేవాసంస్థ నిర్వాహకులు గుబ్బల రాంబాబు ఉన్నారు.

రోడ్డు మధ్యలో చెట్టును తొలగించండి



రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న చెట్టు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట జాతీయ రహదారి నుంచి ఎండోమెంట్‌వాంబే కాలనీకి వెళ్లే 100 ఫీట్ రోడ్డులో డివైడర్ మధ్య వేసిన చెట్లు 15 రోజుల క్రితం పడిపోయింది. దీని వల్ల రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. నగరపాలకసంస్థ అధికారులు స్పందించి వెంటనే పడిపోయిన చెట్టును తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

మహిళలకు శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: మహిళలు శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వాలంబన పొందాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి అన్నారు. సోమవారం బొమ్మూరులోని ఎన్‌టీఆర్ నైపుణ్యాభివృద్ధి, మహిళాసాధికార సంస్థ(మహిళాప్రాంగణం)లో టైలరింగ్, స్వీట్స్ అండ్ స్నాక్స్, బ్యూటీషియన్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈకార్యక్రమంలో జిల్లాస్త్రీశిశు సంక్షేమ సాధికారిత అధికారిణి కె.విజయకుమారి, మండల ప్రత్యేకాధికారి కెఎస్.జ్యోతి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ప్రాంగణం మేనేజర్ సీహెచ్‌వీ రసమ్మ, మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, పార్టీనాయకులు పాల్గొన్నారు.

సీడబ్ల్యూసీ జట్టు కార్మికులకు పని కల్పించండి

ప్రకాశం నగర్: లాలాచెరువు సీడబ్ల్యూసీ గొడన్‌లో పని చేస్తున్న కార్మికులకు పని కల్పించాలని రాజమహేంద్రవరం జట్టు లేబర్ యూనియన్ నాయకులు సోమవారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 25న విజయవాడలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనహర్‌ను కలిసి సమస్యను ఆయన వివరిస్తానని హామీ ఇచ్చారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుంచి బియ్యం, ఇతర సామగ్రిని సరఫరా చేయడం లేదని, పని లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

కొన్ని గంటల వ్యవధిలో బాలుడి ఆచూకీ



బుద్దాల శ్రీరామ్

రాజానగరం: తండ్రిపై ఉన్న ప్రేమ ఆ బాలుడిని ఇంటి నుంచి పారిపోయేలా చేసింది. అయితే పోలీసులు సకాలంలో స్పందించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో గాలింపు ముమ్మరం చేయడంతో ఉదయం అదృశ్యమైన ఆ బాలుడి ఆచూకీని సాయంత్రానికే కనుక్కున్నారు. కన్నవారి ఆందోళనను తీర్చారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని తోకాడ ఎస్.జ్యోతి స్కూలులో ఆరో తరగతి చదువుతున్న బుద్దాల శ్రీరామ్(12) సోమవారం ఉదయం స్కూలుకి వెళ్లేందుకు నిరాకరించాడు. దీంతో తల్లి మందలించింది. ఆ కోపంలో స్కూలుకి వెళుతున్నానని బయటకు వచ్చేసిన ఆ బాలుడు ఉపాధి కోసం హైదరాబాద్‌లో ఉంటున్న తండ్రి వద్దకు పయనమయ్యాడు. విషయం తెలియని తల్లి, బంధువులు స్కూలు నుంచి శ్రీరామ్ రాలేదని ఫోన్ రావడంతో కంగారు పడి పరిసరాలన్నీ గాలించారు. చివరకు రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బాలుడు అదృశ్యమైనట్టుగా కేసు నమోదు చేశారు. సమాచారం తెలుసుకున్న జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ ఆ బాలుడు ఆచూకీని తెలుసుకునేందుకు వెంటనే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అభివృద్ధి చెందిన సాంకేతిక పరిజ్ఞానం సాయంతో సాయంత్రాని కల్లా ఆ బాలుడు హైదరాబాద్ వెళ్లినట్టుగా తెలుసుకుని, కన్నతల్లి భయాందోళనను తొలగించారు.

ఇందుకు సంబంధించి స్థానిక సీఐ పి.ప్రసన్న వీరయ్యగౌడ్‌ని సంప్రదించగా తండ్రిని చూడాలనే ఆరాటంలో ఆ బాలుడు (శ్రీరామ్) ఇంటిలో చెప్పకుండా వెళ్లిపోయాడన్నారు. గత రెండు రోజులుగా నాన్న వద్దకు వెళ్తానంటూ తల్లితో అనేవాడని, అయితే ఆ మాటలను ఆమె పెద్దగా పట్టించుకోలేదన్నారు. సోమవారం ఉదయం స్కూల్‌కు వెళ్లకుండా గొడవ చేసి, ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆ బాలుడు రాజానగరం నుంచి రాజమండ్రి వెళ్లి, అక్కడ నుంచి రైలులో సికింద్రాబాద్ వెళ్లాడన్నారు. అక్కడ రైల్వే స్టేషను నుంచి బయటకు వచ్చి తండ్రికి ఫోన్ చేయడంతో ఆచూకీ తెలిసిందన్నారు. వెంటనే అతని తండ్రితో కూడా మాట్లాడి, సురక్షితంగా తండ్రిని కలుసుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు.

సామూహిక సీమంతాలు

రాజానగరం: పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా స్థానిక శ్రీరాజా కాండ్రేగుల బహదూర్ పంతులు అన్నదాన సత్రం ఏరియాలోని కల్యాణ మండపంలో సోమవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. రాజానగరం ఐసీడీఎస్ సీడీపీఓ టి.నాగమణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పౌష్టికాహారం ఆవశ్యకతను, తక్కువ ఖర్చుతో తయారు చేసుకునే విధానాన్ని, ఆరోగ్యవంతమైన బిడ్డను ప్రసవించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి అవగాహన కలిగించారు. అలాగే బేటి బచావో, బేటీ పడావో పై అవగాహన కలిగించడంతోపాటు విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, వకృత్వ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్‌కె దుర్గామణి, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విరిగిన వంతెన ఫుట్‌పాత్



వంతెనపై విరిగిన ఫుట్‌పాత్ బల్ల

కడియం: మండల కేంద్రమైన కడియంలోని దేవీచౌక్ వద్ద గల బ్రిడ్జి ఫుట్‌పాత్ బల్ల విరిగిపోయింది. సోమవారం రాత్రి ఒక వ్యక్తి నడుచుకుంటూ వెళుతుండగా బల్ల విరిగిపోయిందని స్థానికులు తెలిపారు. దీంతో స్థానికులు అక్కడ హెచ్చరికబోర్డు ఏర్పాటు చేసి, విరిగిన సిమెంట్ బల్లపై నడవకుండా తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. కాగా నిత్యం ఈ వంతెన మీదుగా అధిక సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన ఫుట్‌పాత్ సిమెంటు బల్ల విరిగిపోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం సంబంధిత అధికారులు వంతెన ఫుట్‌పాత్‌కు మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.